

# అప్పుల కుప్ప

## రాష్ట్రంపై 2.05 లక్షల కోట్ల రుణ భారం

**బడ్జెట్‌లో హేతుబద్ధత లేదు.. సాగునీటి ప్రాజెక్టుల నుంచి ఫలితాలేవీ?**

**దివాలా దిశగా సీపీఎస్ వ్యవస్థ.. 2014 నుంచి 141 కోట్లు బాకీ**

పన్ను వసూళ్లలో రాష్ట్రం భేష్

మూలధన వ్యయంలోనూ ముందంజ

కేసీఆర్ కిట్‌లో 100% లక్ష్యసాధన: కాగ్

హైదరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ సరిగా లేదని, రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) పేర్కొంది. 2018 మార్చి నాటికే రాష్ట్ర అప్పులు రూ.2.05 లక్షల కోట్లకు చేరాయని, కొత్తగా తెస్తున్న అప్పుల్లో సింహభాగం పాత రుణాలు తీర్చేందుకే ఉపయోగించాల్సి వస్తోందని

మిగతా 9వ పేజీలో...

## కోతల రాయుడు కేసీఆర్

మాంద్యం లేదు.. ఉన్నది మందగమనమే

కూతురినే గెలిపించుకోలేకపోయారు

మహారాష్ట్రలో పోటీ చేసి గెలుస్తారట?

రాష్ట్రం దాటితే టీఆర్ఎస్ చెల్లని రూపాయి


మిత్రపక్షానికి పీఏసీ చైర్మన్ పదవా?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

2

# అప్పుల కుప్ప

(మొదటి పేజీ తరువాయి)



వెల్లడించింది. 2017-18 మార్చి నాటికి ముగిసిన సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులను కాగ్ తన నివేదికలో వివరించింది. ఈ నివేదికను ప్రభుత్వం ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టింది. వార్షిక బడ్జెట్ అంచనాలు, వాస్తవాలకు భారీ వ్యత్యాసం ఉందని కాగ్ స్పష్టం చేసింది. రెవెన్యూ రాబడి, ఖర్చు, మూలధన వ్యయంలో అంచనాలు, వాస్తవాలకు పోలిక లేదని పేర్కొంది. బడ్జెట్ రూపకల్పనలో హేతుబద్ధత అవసరమని సూచించింది. సాగునీటి ప్రాజెక్టుల నుంచి ఏ మేరకు ఫలితాలు పొందుతున్నారో ప్రభుత్వం ప్రకటించలేకపోయిందని కాగ్ ఆక్షేపించింది. నిర్మాణంలో జాప్యం వల్ల ప్రాజెక్టుల వ్యయం భారీగా పెరిగినట్లు పేర్కొంది. పెట్టుబడులపై రుణాలు డిస్కంలపై ప్రభావం చూపుతాయని స్పష్టం చేసింది. పన్నుల వసూలు, మూలధన వ్యయంలో మాత్రం కేసీఆర్ సర్కారు ముందంజలో ఉందని ప్రశంసించింది. కేసీఆర్ కిట్ పథకం విజయవంతమైందని కొనియాడింది.

### ఆర్థిక నిర్వహణ బాగా లేదు..

ఆర్థిక క్రమశిక్షణ విషయంలో దృఢ వైఖరి అవలంబించాలని కాగ్ సూచించింది. అలా కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలకు బేషరతుగా రుణాలివ్వడం, పాత రుణాలను తిరిగి చెల్లించేందుకు మళ్లీ అప్పులివ్వడం జవాబుదారీతనానికి విఘాతం కలిగిస్తుందని.. ఆర్థిక నిర్వహణ సరిగా లేదన్న విషయాన్నీ తెలియజేస్తుందని అభిప్రాయపడింది. 'అప్పుల చెల్లింపు భారాన్ని తట్టుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరులను పెంచుకోవాలి. ఇది జరగాలంటే భూములు అమ్ముకోవాలి. లేదా పన్నులు పెంచుకోవాలి. లేకపోతే మూలధన వ్యయాన్ని తగ్గించుకోవాల్సి వస్తుంది' అని కాగ్ హెచ్చరించింది. రూ.26,231 కోట్లు అప్పు తెస్తే అందులో రూ.10,836 కోట్లు వడ్డీ చెల్లింపులకు, మరో రూ.4,549 కోట్లు అసలు అప్పు చెల్లింపులకే వెచ్చించాల్సి వచ్చిందని వివరించింది. పన్నుల రాబడిలో 8 శాతం అప్పులు చెల్లించడానికే పోతోందని తెలిపింది. రాష్ట్ర ఆవిర్భావ సమయంలో జీఎస్‌డీపీతో పోల్చినపుడు అప్పులు 15.29 శాతం ఉండగా 2017-18లో 19 శాతానికి పెరిగాయంది. 2018 మార్చి నాటికి ఉన్న మొత్తం అప్పు రూ.1,42,918 కోట్లు అని తెలిపింది. ఈ అప్పులు, వడ్డీల చెల్లింపులకు రానున్న ఏడేళ్లలో ప్రభుత్వం రూ.1.63 లక్షల కోట్లు సమకూర్చుకోవాల్సి ఉంటుందని వివరించింది. మరో వైపు పూచీకత్తుల అప్పు రూ.41,892 కోట్లని.. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉన్న అప్పుల భారం రూ.2.05 లక్షల కోట్లని కాగ్ వెల్లడించింది. రాష్ట్రంలో రాబడి పెరిగినా, అంచనాల స్థాయిలో లేదని తెలిపింది. 2017-18కి రెవెన్యూ రాబడి రూ.88,824 కోట్లు, అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే రూ.6006 కోట్లు పెరిగినప్పటికీ బడ్జెట్ అంచనాలతో పోలిస్తే రూ.24,259 కోట్లు తగ్గిందని వివరించింది. రెవెన్యూ ఖర్చుల విషయంలోనూ ఇదే పరిస్థితి. ఖర్చులు రూ.85,365 కోట్లని, ఇవి అంతకు ముందు ఏడాదితో పోలిస్తే రూ.3933 కోట్లు పెరుగుదల ఉన్నప్పటికీ అంచనాల కంటే రూ.7028 కోట్లు తక్కువని పేర్కొంది. అంచనాలకు, వాస్తవాలకు మధ్య అంతరం తగ్గేలా బడ్జెట్ తయారీ ప్రక్రియను హేతుబద్ధం చేయాలని కాగ్ స్పష్టం చేసింది. రాష్ట్రంలో 2015-16, 2017-18 మధ్యకాలంలో రెవెన్యూ రాబడి, ఖర్చులు రెండూ పెరిగినట్లు కాగ్ నివేదిక పేర్కొంది. రెవెన్యూ మిగులును రూ.3743.74 కోట్ల మేర ఎక్కువగా చూపగా, ద్రవ్యలోటును రూ.954.60 కోట్ల మేర తగ్గించి చూపారని వెల్లడించింది. 2016-17తో పోలిస్తే 2017-18లో వడ్డీ చెల్లింపుల్లో 26 శాతం పెరుగుదల ఉందని తెలిపింది. విద్యారంగంలో రాష్ట్రం వెనుకబడిందని తెలిపింది.

### ప్రాజెక్టుల ఫలితాలను మదింపు చేయాలి..

సాగునీటి పారుదల రంగం మీద పెడుతున్న భారీ పెట్టుబడుల వల్ల కలిగిన ప్రయోజనాలను మదింపు చేయడానికి వాటి ఫలితాలను ప్రభుత్వం సంకలనం చేయాలని కాగ్ తెలిపింది. 2018 మార్చి నాటికి రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని.. వీటిలో 19 ప్రాజెక్టుల విషయంలో 3-11 ఏళ్ల వరకూ జాప్యం జరిగిందని వెల్లడించింది. ఈ కారణంగా తొలి అంచనా వ్యయం రూ.42,201 కోట్ల నుంచి రూ.1,32,928 కోట్లకు పెరిగిందని వివరించింది. ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే రూ.70,758 కోట్లు ఖర్చు చేసినా అవి ఇంకా పూర్తి కాలేదని గుర్తుచేసింది. దీనికి అదనంగా రూ.35,200 కోట్లతో పాలమూరు రంగారెడ్డి పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందని.. సాగునీటి ప్రాజెక్టుల ఆర్థిక ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదని వెల్లడించింది. విద్యుత్తు పంపిణీ సంస్థల (డిస్కంలు)కు బకాయిలను విడుదల చేయాలని సూచించింది. నూతన విధాన నిర్ణయాలను అమలు పరిచేటప్పుడు డిస్కంలకు నష్టపరిహారం చెల్లించాలని కాగ్ సిఫారసు చేసింది. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు నిర్ణయం డిస్కంల ఆర్థిక పరిస్థితులను మరింత ప్రభావితం చేసిందని వివరించింది.

# కేసీఆర్ కిట్ 100%..



రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులేమో ఘనంగా ఉంటుండగా.. నిధుల విడుదల అంతంతమాత్రంగానే ఉంటోందని కాగ్ పేర్కొంది. అనేక సంక్షేమ పథకాలకు నిధులు భారీగా కేటాయించినా.. విడుదల చేసింది నామ మాత్రమేనని తెలిపింది. కేసీఆర్ కిట్ పథకాన్ని మాత్రం ప్రశంసించింది. ఈ ఒక్క పథకంలోనే లబ్ధిదారుల సంఖ్యను 100శాతం సాధించగలిగి నట్లు వెల్లడించింది. మిగతా అన్ని పథకాల్లో బడ్జెట్ కేటాయింపులు, లబ్ధిదారుల లక్ష్యాన్ని సాధించలేక పోయినట్లు వివరించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకంలో అయితే ఘోరంగా విఫలమైనట్లు తెలిపింది. లబ్ధిదారుల లక్ష్య శాతం సున్నాగా పేర్కొంది.



# క్యాపిటల్ వ్యయంలో భేష్

**రాష్ట్ర ప్రభుత్వం పన్నుల వసూళ్లలో సమర్థంగా వ్యవహరించిందని కాగ్ ప్రశంసించింది. పన్నుల వసూళ్లు పెరగ్గా, వసూళ్ల కోసం చేస్తున్న ఖర్చు తగ్గిందని తెలిపింది. ద్రవ్య ప్రాధాన్యత విషయంలో సాధారణ హోదా గల ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అభివృద్ధి వ్యయం రూ.84006 కోట్లు, క్యాపిటల్ వ్యయం రూ.23902 కోట్లతో తెలంగాణ ముందంజలో ఉందని వెల్లడించింది.**

## నివేదికలోని మరికొన్ని అంశాలు

- పునరావృతమవుతున్న అధిక ఖర్చులకు గల కారణాలను ప్రభుత్వం విశ్లేషించాలి.
- ఇప్పటికే ఉన్న అధిక వ్యయాలన్నింటినీ వీలైనంత త్వరగా క్రమబద్ధీకరించుకోవాలి.
- వైద్య, ఆరోగ్య, సాంఘిక సంక్షేమ విభాగాల కింద పదే పదే మిగుళ్లు ఏర్పడడం.. ఆ శాఖల్లోని పథకాలకు ప్రభుత్వం నుంచి తగు ప్రాధాన్యం అందకపోవడాన్ని, సదరు శాఖల అసమర్థతను సూచిస్తోంది.
- సీ కేటగిరీ పీడీ ఖాతాలను సమీక్షించి, ప్రభుత్వ ఉత్తర్వుల్లో నిర్దేశించిన ప్రకారం ఖర్చవకుండా ఉన్న నిల్వలను ఖజానా అధికారులు రద్దు చేసేందుకు ప్రభుత్వం ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- స్వయం పాలక సంస్థలు, అథారిటీలు తమ వార్షిక పద్దులను సమర్పించడంలో జాప్యం చేస్తున్నాయి.
- కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టులపై గణనీయంగా పెట్టుబడులు పెట్టింది.

## దివాలా దిశగా పింఛను వ్యవస్థ

సీపీఎస్ కోసం ఉద్యోగుల మూలవేతనం, కరవు భత్యాల నుంచి ప్రభుత్వం ప్రతి నెలా 10శాతం చందాల రూపంలో వసూలు చేస్తోంది. దీనికి సమానమైన మొత్తాన్ని తన వాటాగా చెల్లించాల్సి ఉంది. కానీ, ఇది అమలు కావడం లేదని, ప్రభుత్వం కనీసం వడ్డీలు కూడా చెల్లించడం లేదని కాగ్ పేర్కొంది. ప్రభుత్వం తన వాటాను తక్కువగా జమ చేయడం, వడ్డీ కోసం కేటాయింపులు చేయకపోవడం వల్ల రెవెన్యూ మిగులు ఎక్కువగాను ద్రవ్యలోటును తక్కువగా చేసి చూపినట్లు తేలిందని స్పష్టం చేసింది. 2014-15 నుంచి ప్రభుత్వం ఉద్యోగులకు రూ. 141.79 కోట్లు బకాయి పడిందని తెలిపింది. ప్రభుత్వం తన తప్పులను సరిదిద్దకపోతే సీపీఎస్ మూలనిధి దివాలాకు దారితీసి, పథకం వైఫల్యానికి, చివరికి చందాదారుల ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

# జీహెచ్ఎంసీ
# ఇదేం చోద్యం




కేంద్రం సొమ్ములిచ్చినా మూసీ సుందరీకరణ చేపట్టని, రోడ్లు అభివృద్ధి చేయని జీహెచ్ఎంసీ తీరుపై కాగ్ మండిపడింది. సంస్థ నిర్లక్ష్యం కారణంగా వందల కోట్లు వెనక్కి పోయాయని వెల్లడించింది. కేటాయించిన నిధులను సకాలంలో వినియోగిస్తే మూసీ కొంత వరకైనా మెరుగుపడేదని అభిప్రాయం వ్యక్తం చేసింది.

- కేంద్ర నిధులను ఖర్చు చేయని తీరు
- నగర రోడ్ల నిధులు రూ.366 కోట్లు వెనక్కి
- మూసీ సుందరీకరణకు ఇచ్చిన రూ.377 కోట్లు కూడా
- జీహెచ్ఎంసీకి రావాల్సిన ఇతర గ్రాంట్లదీ అదే దారి
- వందల కోట్లు వదిలేశారు
- నిర్లక్ష్యాన్ని ఎండగట్టిన కాగ్
- వాటర్‌బోర్డు, హెచ్ఎండీఏ, మెట్రోలు బకాయిలివ్వవా?
- సర్కారుకు ఆర్థికపరమైన క్రమశిక్షణ లేదని వెల్లడి

23లో..

ఆంధ్రజ్యోతి

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

హైదరాబాద్ • సోమవారం 23 సెప్టెంబర్ 2019

# వందల కోట్లు వదిలేశారు..!

**జీహెచ్ఎంసీ నిర్లక్ష్యాన్ని ఎండగట్టిన కాగ్**

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్22 (ఆంధ్రజ్యోతి) :** ఒకటి కాదు.. రెండు కాదు.. వందల కోట్ల రూపాయలు. గ్రేటర్ హైదరాబాద్‌లోని రోడ్ల అభివృద్ధికి, మూసీనది సుందరీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు తిరిగి వెనక్కి వెళ్లాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణీత వాటాలతో కోట్లాది రూపాయలను సకాలంలో హైదరాబాద్ అభివృద్ధిలో వినియోగించుకోలేదని కాగ్ తన నివేదికలో స్పష్టం చేసింది. సకాలంలో కేటాయింపులు చేసి వినియోగించుకోకపోవడం వల్లే నిధులు వెనక్కి వెళ్లాయని అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టింది.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో రోడ్ల అభివృద్ధి కార్యక్రమాల కోసం కేటాయించిన బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చు రూ.11.21కోట్లు మాత్రమే. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన రూ..366.13కోట్లు ఖర్చు చేయకపోవడంతో నిధులు వెనక్కివెళ్లాయని, రోడ్ల అభివృద్ధి కార్యక్రమాలు జాప్య మయ్యాయని కాగ్ నివేదికలో పేర్కొంది. అదేవిధంగా మూసీనది అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.377.35కోట్లు రాగా, ఆ నిధులను ఖర్చు చేయకపోవడంతో వంద శాతం మిగులు ఏర్పడి తిరిగి వెనక్కివెళ్లిపోయాయి. మూసీనది అభివృద్ధి చేస్తున్నట్లుగా ఏళ్ల తరబడి ప్రణాళికలు రూపొందిస్తున్నా.. అభివృద్ధి పనులు సాగడం లేదు. కేటాయించిన నిధులను సకాలంలో వినియోగిస్తే మూసీ సుందరీకరణ కొంత వరకైనా మెరుగుపడేది. నిధులు ఖర్చు చేయలేక, మూసీ సుందరీకరణ జరగకా చివరకు మురికి కూపంగా మారుతోంది. అదేవిధంగా రాష్ట్రంలోని నగర పాలక కార్పొరేషన్లకు సాయంగా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన గ్రాంట్లను జీహెచ్ఎంసీతోపాటు ఇతర కార్పొరేషన్లకు వినియోగించకపోవడంతో రూ. 288.42 కోట్లు వెనక్కివెళ్లాయి.

ఇలా వందల కోట్ల రూపాయలు వచ్చినా గానీ సరైన సమయంలో వినియోగించకపోవడంతో వివిధ పథకాలకు ఇబ్బందులు ఎదురయ్యాయని, నిధుల కేటాయింపుల్లో ఉన్న నిర్లక్ష్యాన్ని కాగ్ ఎండగట్టింది.



# వాటర్‌బోర్డు అప్పులపై అభ్యంతరం

**ఆర్థికపరమైన జవాబుదారీ తనానికి ధ్రువీకరణలేదు**

**వందల కోట్ల పూచీకత్తు ఎలా ఇస్తారు?**

**నివేదికలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కాగ్**

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్22 (ఆంధ్రజ్యోతి) :** వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం వాటర్‌బోర్డు తీసుకున్న అప్పులు, ఆ అప్పులకు రాష్ట్ర ప్రభుత్వ పూచీకత్తుపై కాగ్ అభ్యంతరాలు తెలిపింది. వాటర్‌బోర్డుకు వచ్చే ఆదాయానికి మించి అత్యధికంగా అప్పులిచ్చేందుకు పూచీకత్తు ఇవ్వడంపై పలు సందేహాలను వ్యక్తం చేసింది. ఆదాయానికి మించి వందల కోట్ల అప్పులకు ఏవిధంగా పూచీకత్తు ఇస్తారని ప్రశ్నించింది. వాటర్‌బోర్డు తీసుకున్న అప్పులకు రాష్ట్ర ప్రభుత్వం పూచికత్తు ఇవ్వడంలో ఫిసికల్ రెస్పాన్స్‌బులిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బీఎం) చట్టం -2015ను ఉల్లంఘిస్తున్నట్లు కాగ్ తన నివేదికలో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అప్పులుగా తీసుకున్న హెచ్ఎండీఏ, వాటర్‌బోర్డు, మెట్రో రైలు లిమిటెడ్‌లు తిరిగి చెల్లింపులు చేయవా..? అని ప్రశ్నించింది.

రాష్ట్ర ప్రభుత్వం హామీ ఉన్న రుణాల పూచీకత్తులో 39శాతం వాటర్‌బోర్డు అప్పులకు సంబంధించినవే ఉన్నాయి. వందశాతం ముప్పును కలిగించే ఆస్కారమున్న పూచీకత్తులు చివరకు ఎగవేతల భారం ప్రభుత్వం మీదే పడుతుంది. పూచీకత్తులను ఇచ్చేటప్పుడు పాటించాల్సిన ఆదేశాలను ప్రభుత్వం ఏమేరకు నిర్వహించిందో విశ్లేషించింది. అప్పులు తీసుకుంటున్న సంస్థలు ఆర్థికపరమైన పనితీరును లాభదాయత్వం, నిర్వహణ సామర్థ్యం, ద్రవ్యనిష్పత్తులు వంటి వాటి ద్వారా ప్రభుత్వం విశ్లేషించాలి. కానీ.. 2010-11 నుంచి వార్షిక పద్దులను కాగ్‌కు వాటర్‌బోర్డు ఇవ్వడం లేదు. వార్షిక పద్దులను ఖరారు చేయని వాటర్‌బోర్డు తీసుకున్న రూ.3,399కోట్లకు ప్రభుత్వం పూచీకత్తు ఇవ్వడంపై సందేహాలను వ్యక్తం చేసింది. ఆర్థికపరమైన జవాబుదారీ తనాన్ని ధ్రువీకరించుకోకుండా ప్రభుత్వం పూచీకత్తులు ఇస్తున్నట్లు నివేదికలో స్పష్టం చేసింది.




**వాటర్‌బోర్డు, హెచ్ఎండీఏలు బకాయిలు చెల్లించవా..?**

వాటర్‌బోర్డు, హెచ్ఎండీఏల పాత రుణాలను తీర్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అప్పులు ఇచ్చింది. ప్రధానంగా వాటర్‌బోర్డు హడ్కో రుణాలు చెల్లించేందుకు రూ.1195 కోట్లను ప్రభుత్వం ఇచ్చింది. అదేవిధంగా హెచ్ఎండీఏకు రూ.263.72కోట్లు, మెట్రో రైలు లిమిటెడ్‌కు రూ.163.73కోట్లను ప్రభుత్వం అప్పుగా ఇచ్చింది. వాటర్‌బోర్డు, హెచ్ఎండీఏ, మెట్రో రైలు లిమిటెడ్‌లు 2010-11, 2014-15ల నుంచి ప్రభుత్వానికి బకాయిల్లో ఉన్నాయి. ఇచ్చిన రుణాలను తిరిగి వసూళ్లు చేసుకోవడంలో ప్రభుత్వం సక్రమంగా లేదని స్పష్టం చేసింది. పద్దులను ఖరారు చేసే ఆర్థికపరమైన క్రమశిక్షణ పాటించే విషయంలో దృఢవైఖరి అవలంబించకుండా రుణాలు అందించడం, పాత రుణాలు తిరిగి చెల్లించడం కోసం మళ్లీ రుణాలివ్వడం జవాబుదారీతనానికి విఘాతం కలిగిస్తాయని కాగ్ తన నివేదికలో స్పష్టం చేసింది.

## వార్షిక పద్దులివ్వని

# హెచ్‌ఎండీఏ, వాటర్‌బోర్డు

### కొన్నేళ్లుగా జాప్యం చేస్తున్నాయని కాగ్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్22 (ఆంధ్రజ్యోతి): నగరంలో స్వయం పాలక సంస్థలుగా ఉన్న హెచ్‌ఎండీఏ, వాటర్‌బోర్డులు కాగ్‌కు వార్షిక పద్దులు ఇవ్వడం లేదు. ఒకటి, రెండు సంవత్సరాలు కాదు. ఏళ్లతరబడి ఆయా సంస్థలు వార్షిక పద్దులను కాగ్‌కు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాయి. వార్షిక పద్దులను ప్రతి ఏడాది జూన్ 30లోపు ఆడిట్ నిర్వహణకు కాగ్‌కు సమర్పించాలని భారత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) చట్టం-1971లోని 19, 20 సెక్షన్లు స్పష్టం చేస్తున్నాయి. సకాలంలో పద్దులను తయారు చేసి కాగ్ అందజేయాల్సిన సంబంధిత సంస్థలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. తాజాగా కాగ్ నివేదికతో హెచ్‌ఎండీఏ, వాటర్‌బోర్డుల తీరు స్పష్టమవుతోంది.




వాటర్‌బోర్డు, హెచ్‌ఎండీఏలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ గ్రాంట్లు రావడంతోపాటు పాలనాపరమైన విధానాల వల్ల ఏటా వందల కోట్ల ఆదాయం వస్తోంది. అంతేస్థాయిలో వివిధ పనుల నిర్వహణ కోసం వ్యయాలుంటాయి. వాటర్‌బోర్డు, హెచ్‌ఎండీఏ సంస్థలకు వస్తున్న ఆదాయ, వ్యయాలను ప్రతియేటా వార్షిక నివేదికను తయారు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్న గానీ కాగ్‌కు చేరడం లేదు. ఆయా సంస్థలు చేసే ఆదాయ, వ్యయాలను ప్రతీది కాగ్ అధ్యయనం చేస్తుండడంతో డొల్లతనం బయటపడకుండా వార్షిక పద్దులు ఇవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.